క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొమ్మాది: లా కాలేజీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రాజేష్ తెలిపారు. లా కాలేజీ, పంప్ హౌస్, దిశ పోలీస్ స్టేషన్, వరాహగిరినగర్, బీసీ కాలనీ, శ్రీనివాస్‌నగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, దుర్గానగర్, సందీపినినగర్, పెట్రోల్ బంక్ వెనుక ప్రాంతం, దసపల్లా లే అవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి నవోదయ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ వి.సంతోష్‌కుమార్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్, అన్నంరాజు నగర్, డీఆర్‌కే రాజు లే అవుట్, రిక్షా కాలనీ, ప్రశాంతి నగర్‌లో విద్యుత్ పరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేళ్లు



రామాద్రి బీచ్ వద్ద మృతిచెందిన తాబేళ్లు

కొమ్మాది: సముద్రంలో మృత్యు ఘోష ఆగడం లేదు. మొన్నటి వరకు రుషికొండ, సాగర్‌నగర్ తీర ప్రాంతాల్లో మృత్యువాత పడిన తాబేళ్లు, డాల్ఫిన్లు, జెల్లీ ఫిష్‌లు కొట్టుకొచ్చిన సంఘటనలు తెలిసినవే. అయితే గురువారం భీమిలి బీచ్‌రోడ్డు రామాద్రి తీర ప్రాంతానికి రెండు తాబేళ్లు మృత్యువాత పడి తీరానికి కొట్టుకొచ్చాయి. సముద్రంలో కాలుష్యం అతిగా పెరిగినప్పుడే మృత్యువాత పడి తీరానికి కొట్టుకొస్తాయని మత్స్యకారులు తెలిపారు.

నేడు 'అవంతి'కి మిజోరం గవర్నర్ హరిబాబు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభం కానున్న రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ గ్యాన్ – 2కే 23 కార్యక్రమానికి మిజోరం గవర్నర్ కె.హరిబాబు హాజరుకానున్నారు. ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడనున్నట్టు అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దోమలు నిర్మూలించాలని వినతి



ఆదర్శనగర్ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న శీరపు రామలక్ష్మి

తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డు ఆదర్శనగర్‌లో పూర్తిగా డ్రైనేజీలు లేకపోవడంతో పెరిగిపోయిన దోమలను నిర్మూలించాలని కోరుతూ స్థానిక సచివాలయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదర్శనగర్‌లో డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నందున పెరుగుతున్న దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఫాగింగ్ చేసి దోమలను నివారించడంతోపాటు డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.

భూమి ఆక్రమణపై ఫిర్యాదు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో పూర్వీకుల నుంచి తమ సాగులో ఉన్న భూమిని ఓ నాయకుడు ఆక్రమిస్తున్నాడని బర్ల చిన సూరి, బర్ల రాము తహసీల్దార్ ఎం.వి.ఎస్.లోకేశ్వరరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ భూమిని సాగు చేసుకుంటూ 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని ఆ ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు శ్రీకారం



విస్తరణ కోసం తవ్వినచోట మట్టితో నింపుతున్న దృశ్యం



విస్తరిస్తున్న పద్మనాభం - రెడ్డిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు

- పద్మనాభం – రెడ్డిపల్లి మధ్య రహదారి నిర్మాణానికి రూ.10.04 కోట్లు
- చురుగ్గా సాగుతున్న పనులు
- ట్రాఫిక్ కష్టాలు, ప్రమాదాలు తగ్గుతాయని స్థానికుల హర్షం

పద్మనాభం: మండలంలోని పద్మనాభం కన్నయ్య కొనేరు నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ రహదారి నిర్మాణంతో ట్రాఫిక్ కష్టాలు తీరి, ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం – శొంఠ్యాం ఆర్ అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా ఉండే ఈ రోడ్డు టీడీపీ ప్రభుత్వం హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని అప్పట్లో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు చేసిన ప్రకటన అలానే మిగిలిపోయింది. మూడున్నర కిలో మీటర్ల నిడివిలో ఈ రోడ్డు కేవలం పది అడుగుల వెడల్పు మాత్రమే ఉండడం..., మలుపులు ఎక్కువగా ఉండడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయేది. దీని వల్ల ప్రయాణికులు గమ్యస్థానాలకు నిర్ణీత సమయానికి చేరుకోలేకపోయేవారు. మరోవైపు రోడ్డు అంచులు కోతకు గురవడంతో ఎదురుగా వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కకు దిగి మళ్లీ రోడ్డు మీదకు వాహనాలను ఎక్కించేపట్పుడు వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యేవారు. ద్విచక్ర వాహణదారులు, ఆటోల్లో ప్రయాణించన వారు ప్రమాదానికి గురై మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు విస్తరణకు రూ.10.04 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఇప్పటి వరకూ కేవలం పది అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న రోడ్డును 30 అడుగుల మేర విస్తరిస్తున్నారు. ఇందులో 20 అడుగులు బీటీగా నిర్మిస్తున్నారు. ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి ఐదు అడుగుల చొప్పున మట్టితో విస్తరిస్తున్నారు. ఈ రహదారిలో అవసరమైన చోట పది కల్వర్టులు కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తయితే ప్రయాణం సుఖమయం అవుతుందని ప్రయాణికులు అంటున్నారు.

బంజరు భూమి ఆక్రమణకు యత్నం



ఇటీవల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తొలగించిన ఆక్రమణలు



గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమణకు ప్రయత్నించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నమ్మివానిపేటలో అడ్డుకున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేటలో ఆక్రమణదారులు బంజరు భూములపై దృష్టి సారించారు. ఇక్కడి సర్వే నంబర్ 89/2లో మొక్కలు నాటి ఫెన్సింగ్ వేసిన సుమారు 38 సెంట్ల స్థలాన్ని గత ఏడాది డిసెంబర్ 30న భీమిలి రెవెన్యూ, సచివాలయ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ స్థలాన్ని ఆనుకుని నమ్మివానిపేట గ్రామానికి చెందిన విశాలమైన శ్మశానవాటిక ఉంది. ఇక్కడి సర్వే నంబర్ 89/2 స్థలం, శ్మశానవాటికను ఆనుకుని ఉన్న గెడ్డ స్థలాన్ని ఆక్రమించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో గురువారం ప్రయత్నించారు. దీనిని నమ్మివానిపేట వాసులు నమ్మి మాధవ అనే వ్యక్తి ఆధ్వర్యంలో అడ్డుకుని వైఎస్సార్‌సీపీ నాయకులకు సమాచారం అందించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్లా వంశీరెడ్డి ఆధ్వర్యంలో పలువురు అక్కడకు చేరుకుని సచివాలయం, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. నమ్మివానిపేట నుంచి రాయపాలెం వరకు గెడ్డతోపాటు దానిని ఆనుకుని ఆరు ఎకరాల బంజరు భూమి ఉందన్నారు. ఈ స్థలం ఆక్రమణదారుల పాలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బంజరు భూమిలో ఆక్రమణల విషయాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరుతామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల కరపత్రాలను మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: సంక్షేమ పథకాల అమలులో దేశంలో మన రాష్ట్రమే ప్రథమ స్థానంలో ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి సమీపంలోని గొల్లలపాలెంలో గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? లేదా..? అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులందరికీ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు అదనంగా రూ.250 పెంచి నెలకు రూ.2,750 చొప్పున అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇంతలా ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, వారి దుష్ప్రచారాన్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని, అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు 'నాడు – నేడు' పేరుతో పనులు చేయిస్తున్నారన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి చక్కగా బోధిస్తున్నారని, విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా అందించారని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమకు సరిగ్గా మంచినీటి సరఫరా జరగడం లేదని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, తహసీల్దార్ కె.వేణుగోపాల్, పారిశుధ్య అధికారి మహాలక్ష్మినాయుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, స్థానిక నాయకుడు కోండ్రు రామసూరప్పడు పాల్గొన్నారు.

భీమిలి ఏసీపీగా శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా డి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే మధురవాడ నుంచి టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) ఝాన్సీ బదిలీపై ఇక్కడకు వచ్చి బాధ్యతలను స్వీకరించారు. గత కొద్ది నెలలుగా ఈ అధికారుల ఖాళీలు భర్తీ కాకపోవడంతో టౌన్‌ప్లానింగ్ విభాగం పని మీద వచ్చే పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు వీరి నియామకంతో సమస్యలు తీరుతాయని అంతా భావిస్తున్నారు.

నూతన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పింఛన్ల నగదు అందిస్తున్న సచివాలయ కన్వీనర్లు

ఆనందపురం: మండలంలోని వేములవలస పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా పింఛన్ల నగదు పెంచి లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. పంపిణీ కార్యక్రమంలో కన్వీనర్లు కోరాడ మంగలత, పతివాడ పుష్పలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ అప్పలస్వామినాయుడు, సర్పంచ్ లంక కొండమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, వలంటీర్లు పతివాడ గోపాలరావు, లంక జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ సులువు



డ్రోన్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పద్మనాభం: డ్రోన్ పరికరంతో ఏడు నిమిషాల్లో ఎకరం విస్తీర్ణంలో పురుగుల నివారణకు మందులు పిచికారీ చేయవచ్చని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ తెలిపారు. మండలంలోని మద్ది గ్రామంలో గురువారం డ్రోన్ పరికరం పని తీరుపై మారుతీ కంపెనీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా ఎకరానికి పిచికారి చేయడానికి రూ.400 మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. డ్రోన్‌తో పిచికారి చేయడం వల్ల సమయం, ఖర్చు తక్కువ అవుతాయని తెలిపారు. డ్రోన్ అసలు ఖరీదు రూ.10 లక్షలు కాగా సబ్సిడీపై రూ.6 లక్షలకు సరఫరా చేస్తామని తెలిపారు. ఈ పరికరం కోసం నలుగురు నుంచి ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి బ్యాంకు అకౌంట్ తెరవాలని సూచించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ఏవోలు ఎం.వి.ఎస్.చలం, ఎస్.శివకోమలి, సంధ్యారత్నప్రభ పాల్గొన్నారు.



యలమంచిలిలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు. చిత్రంలో ఆడారి ఆనంద్ తదితరులు ఉన్నారు.

స్కైప్ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ

అంతర్జాతీయ పోటీలకు జ్ఞానవర్ధన్ ఎంపిక



జ్ఞానవర్ధన్‌ను అభినందిస్తున్న గ్రామపెద్దలు

ఆనందపురం : మండలంలోని మిందివానిపాలెం గ్రామానికి చెందిన నాగిశెట్టి జ్ఞానవర్ధన్ గత ఏడాది డిసెంబర్ 30 నుంచి ఈ నెల 2 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కైప్ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ – 14 (25 కిలోల విభాగం)లో ఈ ఘనత సాధించాడు. 23 రాష్ట్రాల నుంచి 2,500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. త్వరలో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించినట్టు జ్ఞానవర్ధన్ తెలిపాడు. ఈ సందర్భంగా గురువారం గ్రామపెద్దలు లెంక రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ బొద్దపు బంగార్రాజు, ఉప సర్పంచ్ జి.స్వామినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పల్లా రమణ తదితరులు అభినందించారు. అలాగే స్కైప్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆబోతుల అప్పలరామును కూడా అభినందించారు. పురాతన క్రీడను గుర్తించి ఇటీవల ప్రభుత్వం ఎస్‌జీఎఫ్‌లో కూడా చేర్పిందన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన ఎస్‌జీఎఫ్‌లో మన జిల్లా నుంచి 22 మంది పతకాలు సాధించినట్లు రాంబాబు గుర్తు చేశారు.

గిడిజాలలో బాలికకు డెంగ్యూ



గిడిజాలలో సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

ఆనందపురం: మండలంలోని గిడిజాలలో ఓ బాలికకు డెంగ్యూ సోకి కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ మేరకు గ్రామంలో గురువారం జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి, వైద్యాధికారి షేక్ షహనాజ్ సాధియా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. డెంగీ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా పలు ఇళ్ల ముందు దోమల లార్వా కేంద్రాలను గుర్తించి నాశనం చేశారు. జ్వర పీడితుల నుంచి రక్తపూతలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ షిణగం అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి పి.రామారావు, ఎస్‌యూవో నూకరాజు, ఆరోగ్య పర్యవేక్షకులు టి.కల్యాణమ్మ, పి.సన్యాసిరావు, డి.దేవి, ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మల్లయ్యపాలెంలో బీమా పరిహారం అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు 60వ నంబరు సచివాలయం పరిధిలోని మల్లయ్యపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కలివేల్పు ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా పరిహారం రూ.లక్ష వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు గురువారం అందజేశారు. నర్సింగరావు కొంత కాలం క్రితం మరణించడంతో కుటుంబీకులకు పరిహారం అందజేశారు. మాజీ సర్పంచ్ కుడితి రామారావు, సచివాలయం కన్వీనర్ అల్లాడ లింగేశ్వరరావు, వెల్ఫేర్ సెక్రటరీ శ్రావణి, అడ్మిన్ సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

జెడ్సీకి అభినందనలు



జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

మధురవాడ: కొత్తగా బాధ్యతలు చేపట్టిన జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మిని గురువారం సాయంత్రం మధురవాడ జోనల్ కార్యాలయంలో పలువురు కలిసి అభినందించారు. వీరిలో మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యదర్శి తాతపూడి ప్రదీప్ కుమార్, కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, బాబ్జి, శెట్టిపల్లి జగన్మోహన చౌదరి, వరలక్ష్మి, తోట ఆశాస్వరూప్, బ్రిక్ శ్రీనివాస్, బైపిల్లి సతీష్‌కుమార్, కావ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

మారుతీప్రసాద్‌కు ఎంపీ ఎంవీవీ పరామర్శ



మధురవాడలో మారుతీ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మధురవాడ: ఇటీవల అనారోగ్యానికి గురైన కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు, ప్రముఖ కళాకారుడు వంకాయల మారుతీ ప్రసాద్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం సాయంత్రం పరామర్శించారు. మధురవాడ గణేష్‌నగర్‌లో గల మారుతీప్రసాద్ ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, నాగోతి బాషా ఉన్నారు.

హిందీ లోయర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై నిర్వహించే లోయర్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువు రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 10 వరకు పెంచినట్టు ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు హాజరయ్యే ఔత్సాహికులు 89856 47419లో సంప్రదించాలని కోరారు. ఫిబ్రవరి 11, 12న భీమిలి కేంద్రంగా లోయర్, హయ్యర్ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

బాలాజీనగర్ నెత్తిన హై - ఓల్టేజీ విద్యుత్ వైర్లు

వాలిన, తుప్పు పట్టిన స్తంభాలతో స్థానికుల్లో గుబులు



తాతా థియేటర్ వైపు సీసీ రోడ్డుకు అడ్డంగా స్తంభం



బాలాజీనగర్ కూడలిలో అడ్డంగా విద్యుత్ స్తంభం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ శివారులోని నివాస గృహాల పైనుంచి 11 కేవీ, 33 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కార్లు, చెత్త తరలించే క్లాప్ వాహనాలు, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వాహనాలు, అంబులెన్స్‌ల రాకపోకలకు సీసీ రోడ్ల మధ్యలో ఉన్న స్తంభాలు అడ్డంగా ఉన్నాయి. మరోవైపు ఇళ్లను ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతుండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తుప్పు పట్టిన స్తంభాలు, ప్రమాదకరమైన వైర్లు వాలిపోతున్నాయి. దీంతో విద్యుత్ లైన్ల సమస్యలను పరిష్కరించాలని బాలాజీనగర్ వాసులు ఏళ్లతరబడి కోరుతున్నారు. ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న హై – ఓల్టేజీ లైన్లను జాతీయ రహదారుల వద్దకు మార్చాలని ఇటీవల ప్రభుత్వం కూడా ఆదేశించిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. బాలాజీనగర్‌లో వందలాది కుటుంబాలను ప్రస్తుతం విద్యుత్ స్తంభాల సమస్య వేధిస్తోంది.

కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి...

పాతికేళ్ల క్రితం నివాసగృహాలు లేనప్పుడు విద్యుత్‌శాఖ ఇక్కడి జిరాయితీ భూములలో నుంచి హై – ఓల్టేజీ లైన్లను వేసింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం, జనాభా పెరుగుదల కారణంగా బాలాజీనగర్ శివారు నుంచి శ్రీబాసర లే అవుట్, టి.నగరపాలెం గోస్తనీనది వరకు గృహాల నిర్మాణం పెరిగింది. ఫలితంగా ఇరుకైన రోడ్ల మధ్య విద్యుత్ స్తంభాలు, హై – ఓల్టేజీ లైన్లు ఇక్కడివారిలో కలవరం పుట్టిస్తున్నాయి. ఆర్థిక స్థోమత ఉన్నా రోడ్లకు అడ్డంగా స్తంభాల కారణంగా నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఇక్కడి వారిలో కనిపిస్తుంది. ఒకవేళ కొనుక్కున్నా ఊరి శివారులో అద్దెలు చెల్లించి వాహనాలు నిలుపుకునే పరిస్థితి నెలకొంది. తరచూ ప్రమాదాలు, వాహనాల రాకపోకలకు ఆటంకం కారణంగా స్థానికులు నెల రోజుల క్రితం కలెక్టరేట్‌లోని స్పందన, గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందించారు. కార్లు తిరగడానికి అనువైన సీసీరోడ్లు ఉన్నా కేవలం విద్యుత్ స్తంభాల కారణంగా తిరగడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రమాదాలు జరుగక ముందే బాలాజీనగర్‌లో రోడ్లకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లను మార్చడంతో పాటు హై – ఓల్టేజీ లైన్లను తరలించాలని కోరుతున్నారు.

రెండు దశాబ్దాలుగా తిరుగుతున్నాం



బాలాజీనగర్‌లో నివాసగృహాలు పెరిగిన తర్వాత విద్యుత్ స్తంభాలు, వైర్లు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉంటోంది. ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా జీవీఎంసీ, చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చాం. రెండు దశాబ్దాలుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారమవడం లేదు.

– తమ్మిన అయ్యన్న పాత్రుడు, బాలాజీనగర్